సాక్షి ఒడిశా

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023

I



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,96,606లు, వెండి 65 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



అభివృద్ధి పథకాలకు రూ.6 కోట్లు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వెల్లడించిన ఎమ్మెల్యే తారాప్రసాద్

-IIలో




ఝార్సుగుడలో దీపాలి దాస్ నామినేషన్

- భారీ ర్యాలీ చేపట్టిన బీజేడీ శ్రేణులు

-IIలో

న్యూస్‌రీల్

నేడు జగన్నాథుని బొనొకొ లగ్గి



భువనేశ్వర్: వైశాఖ బహుళ చతుర్దశి పురస్కరించుకుని బుధవారం శ్రీమందిరం రత్న వేదికపై బొనొకొ లగ్గి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రత్న వేదికపై నిత్యపూజలు అందుకుంటున్న మూలవిరాట్‌ల ముఖాలకు అలంకరణ చేస్తారు. ద్వితీయ భోగ మండపం తర్వాత సాయంత్రం 6 గంటలకు ఈ సేవ ప్రారంభిస్తారు. ఆలయ వర్గాల అంచనా మేరకు రాత్రి 10 గంటల వరకు శ్రీముఖ అలంకరణ కొనసాగుతుంది. ఈ వ్యవధిలో ప్రధాన ఆలయ ప్రాంగణానికి సాధారణ భక్తులను నివారిస్తారు. దీనికి అనుగుణంగా బుధవారం సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సుమారు 4గంటల పాటు నిరవధికంగా సర్వదర్శనం నిలిపి వేయనున్నట్లు దేవస్థాన అధికార వర్గాలు మంగళవారం ప్రకటించాయి.

కొరాపుట్ జిల్లాకు రూ.14 కోట్లు మంజూరు



ఎమ్మెల్యే రఘురాం పొడాల్

కొరాపుట్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి జిల్లాకు రూ.14 కోట్ల 70 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సీఎం నవీన్ పట్నాయక్, 5టీ కార్యదర్శి కార్తికేయ పాండ్యన్‌కు కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ప్రకటన వెలువరించిందని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని బంధుగాం సమితి నీలావడిలో అగ్నగంగమ్మ మందిరం అభివృద్ధికి రూ.2 కోట్లు, నారాయణపట్న జగన్నాథ మందిరానికి రూ.4 కోట్లు, పొట్టంగి గంగమ్మ మందిరానికి రూ.3 కోట్లు, కొరాపుట్ లోని జగన్నాథ మందిరం కల్యాణ మండపానికి రూ.1.5 కోట్లు, జేఈఎల్ చర్చి నిర్మాణానికి రూ.3 కోట్లు, జయపురం లోని జగన్నాథ మందిరానికి రూ.1.2 కోట్లు మంజూరయ్యాయని వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో వాహనం దగ్ధం



సీసీ కెమెరాలో నమోదైన ప్రమాద దృశ్యం

రాయగడ: పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో విద్యుత్ స్తంభం వద్ద షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకోవడంతో అక్కడే పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనం దగ్ధమైంది. సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనను.. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి, వెంటనే మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది.

ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఎర్రచందనంతో పోలీసులకు పట్టుబడిన నిందితుడు

కొరాపుట్: ఎర్రచందనం అక్రమ రవాణాకు కొరాపుట్ జిల్లా పోలీసులు అడ్డుకట్ట వేశారు. దీనికి సంబంధించి జిల్లాలోని నందపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఎస్‌డీపీఓ మనోజ్ కుమార్ బెహరా వివరాలను ప్రకటించారు. నందపూర్ పరిధిలోని బట్టిబర్ జంక్షన్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో వ్యవహరిస్తున్నాడని పోలీసులకు సమాచారం అందింది. దీంతో నందపూర్ పోలీసులు అక్కడకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఇందులో నందపూర్ ప్రాంతానికి చెందిన సంతోష్ హంతాల్ వద్ద బస్తాలలో 55కిలోల ఎర్రచందనం కలప ముక్కలు లభించాయి. వీటిని సీజ్ చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.

విద్యుద్దీకరణలో వాస్తవమెంత?

- రాయగడలో జిల్లా విద్యుత్ కమిటీ సమీక్ష
- ప్రభుత్వాన్ని నిలదీసిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక
- 100శాతం గ్రామాలకు విద్యుత్ అందకపోవడంపై ఆవేదన



సమీవేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న జగన్నాథ సరక, ఎంపీ సప్తగిరి, కలెక్టర్ సింగ్

రాయగడ: జిల్లాలోని అన్ని గ్రామాలకు విద్యుద్దీకరణ పూర్తి చేసినట్లు గణాంకాల్లో వివరిస్తున్న సంబంధిత శాఖ.. వాస్తవానికి ఆ దిశగా పనిచేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక ఎత్తిచూపారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా విద్యుత్ కమిటీ సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఇందులో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, సంబంధిత శాఖ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆదివాసీ, హరిజన గ్రామీణ ప్రాంతాలతో జిల్లాలో ఇప్పటికీ కొన్ని గ్రామాలు అంధకారంలో ఉన్నాయని తెలిపారు. అయితే అధికారులు మాత్రం అన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కాగితాల లెక్కలు వాస్తవానికి చాలా తేడా కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న దీన్‌దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ విద్యుద్దీకరణ పథకం ద్వారా జిల్లాల్లో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయాలనేది పథకం ముఖ్య ఉద్దేశం కాగా.. వాస్తవానికి జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదన్నారు.

2011కే వంద శాతం పనులు..

జిల్లాలోని అన్ని గ్రామాలకు 2011 నాటికే సంపూర్ణంగా విద్యుద్దీకరణ పనులు పూర్తి చేశామని విద్యుత్‌శాఖ సీనియర్ ఇంజినీర్ ప్రియరంజన్ బెహరా ప్రకటించారు. జిల్లాలో అమలులో ఉన్న విద్యుత్ పథకం ద్వారా వంద శాతం గ్రామాలకు విద్యుత్ అందిస్తున్నామన్నారు. అయితే మారుమూల గ్రామాల్లో ప్రజలు కొండకోనల్లో చిన్న చిన్న గూడేలు నిర్మించుకొని, అనంతరం గ్రామాలుగా మలుచుకున్నారని తెలిపారు. జిల్లాలో ఇటువంటి గూడేలు సుమారు 50 కొత్తగా వెలిశాయని తెలిపారు. వీటికి మాత్రం విద్యుత్ సౌకర్యం కల్పించలేదని అంగీకరించారు. ఇదిలా ఉండగా మౌలిక సదుపాయాలు లేకపోవడం, స్తంభాలు కొరత కారణంగా ఆయా గ్రామాలకు ఇంతవరకు విద్యుత్ సౌకర్యం కల్పించలేక పోయామని తెలియజేశారు. అయితే జిల్లాలో కొండలపై ఉన్న దాదాపు 139 చిన్న చిన్న గ్రామాలకు సౌరశక్తి వినియోగించి, విద్యుత్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. కనీసం 15 కుటుంబాలు ఉన్న 109 గ్రామాల్లో బిజూ గ్రామీణ విద్యుత్ పథకం ద్వారా ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు స్పష్టంచేశారు. ఈ పథకం ద్వారా పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, బిజూకల్యాణ మండపాలు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇప్పటికే విద్యుద్దీకరణ పనులు పూర్తి చేశామన్నారు. దీనికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం రూ.6.9 కోట్ల నిధులు మంజూరు చేసిందని వివరించారు. మరో రూ.17 కోట్ల నిధులు ఉన్నట్లు పేర్కొన్నారు. కొత్తగా నిర్మించిన 12పాఠశాలలకు విద్యుత్ సరఫరా ఇవ్వాల్సి ఉందన్నారు.

బిల్లుల చెల్లింపునకు వెసులుబాటు

జిల్లా సంక్షేమశాఖ అధికారి అశోక్ కుమార్ శత్పతి మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సంబంధించిన విద్యుత్ వినియోగ బిల్లుల చెల్లింపు విషయంతో జాప్యం జరిగితే సంబంధిత శాఖ సరఫరాను నిలిపివేస్తుందని, దీంతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సింగ్ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, ఆస్పత్రి వంటి వారికి బిల్లుల చెల్లింపు విషయంతో కొంత వెసులుబాటు ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు ఏడాదికి 2సార్లు జరుగుతున్న సమీక్ష సమావేశం ఇకపై ప్రతి 3నెలలకు ఒకసారి నిర్వహించేందుకు తీర్మానించారు. సమావేశంలో గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమంగొ, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరా, విద్యుత్‌శాఖ విభాగం(రాయగడ)ఇంజినీర్ నారాయణ నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై మండిపాటు..



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి, పక్కన కలెక్టర్ సింగ్

రాయగడ: ఖనిజ, ప్రాకృతిక సంపదలకు నిలయమైన రాయగడ జిల్లాలో ఉన్న భారీ పరిశ్రమలు.. వాటిని ముడి సరకుగా వినియోగించు కుంటున్నందుకు ప్రతిఫలంగా జిల్లా యంత్రాంగానికి అందిస్తున్న మినరల్ ఫండ్ దుర్వినియోగం అవుతోందని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక ఆవేదన వ్యక్తంచేశారు. డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మినరల్ ఫండ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరైన ఆయన.. మాట్లాడారు. జిల్లాలోని భారీ పరిశ్రమలు జిల్లా అభివృద్ధికి మినరల్ ఫండ్ పేరిట అందిస్తున్న నిధులు సక్రమంగా వినియోగించుకోక పోవడంతో అభివృద్ధి మందగిస్తోందని, నిధులు కూడా వృథా అవుతున్నాయని ఆరోపించారు. పరిశ్రమల పరిసర ప్రాంతాల అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు వినియోగించాల్సి ఉన్నప్పటికీ యంత్రాంగం ఆ దిశగా పనిచేయడం లేదన్నారు. గ్రామాలకు వెళ్తే.. అయా ప్రాంత ప్రజలు తమ దృష్టికి ఎన్నో సమస్యలు తీసుకు వస్తున్నారని, పరిశ్రమల పరిసరాల్లోని ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన వసతులు లేక నానా అవస్థలు పడుతున్నారని అసహనం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలక్టర్ స్వాధాదేవ్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు 50శాతం నిధులు పరసర ప్రాంతాల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నట్లు వివరించారు. మిగతా నిధులతో విద్య, వైద్యం, తాగునీరు వంటి వాటిని మెరగుపరిచేందుకు కేటాయిస్తున్నామన్నారు. 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 వరకు జిల్లాకు రూ.95,58,77,038ల నిధులు డీఎంఎఫ్(జిల్లా మినరల్ ఫండ్) రాగా.. ఇప్పటి వరకు 75 ప్రాజెక్టు పనులు చేపట్టామని వెల్లడించారు. ఖర్చులు పోగా ఇంకా రూ.36,50,34,230ల నిధులు ఉన్నాయని ప్రకటించారు. కమిటీ సభ్యులు నిర్ధారించిన మేరకు, మిగతా నిధులు ఏ విధంగా ఖర్చు చేయాలో కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు. సమావేశంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిశ్రమల మంత్రిని కలిసిన 'సేవా' కార్మికులు



మంత్రి ప్రతాప్ కేశరికి కార్మికుల సమస్యలు వివరిస్తున్న మహంతి

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని గగణాపూర్ సేవాపేపరు మిల్లు కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి ప్రతాప్‌కేశరి దేవ్‌ను భువనేశ్వర్‌లో మంగళవారం కలిసారు. ఈ సందర్భంగా మిల్లు, కార్మికుల సమస్యలపై చర్చించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆశిష్ కనుండో, యూనియన్‌ల కార్యాచరణ కమిటీ కార్యదర్శి ప్రమోద్‌కుమార్ మహంతి మంత్రికి వినతిపత్రం అందజేశారు. 2020లో సేవా పేపరు మిల్లును మదర్ అర్త్ కంపెనీ తీసుకుందని, మిల్లు నడిపేందుకు రూ.150 కోట్లను బ్యాంకు నుంచి రుణంగా కూడా తీసుకుందని తెలిపారు. అయినా పరిశ్రమను పూర్తిస్థాయిలో నడపడం లేదన్నారు. పునరుద్ధరణ కోసం నూతన యాజమాన్యం అప్పుగా తీసుకున్న రూ.150 కోట్లలో పాత యజమానికి రూ.100 కోట్లు చెల్లించిందని పేర్కొన్నారు. అయితే కలప, బొగ్గు, విడి భాగాలు, ముడి సరకు కొరత కారణం చూపిస్తూ.. చాలా రోజులుగా కర్మాగారాన్ని నిర్వహించడం లేదని వాపోయారు. పని ఎందుకు నిలుపుదల చేస్తున్నారో కార్మికులకు సరైన సమాధానం, సమాచారం లేకుండా పోయిందన్నారు. దీనిపై విచారణ జరిపాలని కోరారు. అలగే బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ విస్మరించి, రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించకుండా 2020 నుంచి ఈ విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మిల్లు నడిపేందుకే రాష్ట్రప్రభుత్వం ఎన్‌ఓసీ ఇవ్వలేదని, పాత యాజమాన్యం చెల్లించని నీటి సెస్సు, విద్యుత్ బకాయిలు మాఫీ చేసేందుకు ప్రభుత్వాన్ని కోరామని గుర్తుచేశారు. కార్మికులు, వారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని, కర్మాగారాన్ని సక్రమంగా నిర్వహించాలని విన్నవించారు. దీనిపై స్పందించిన మంత్రి.. సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక అందించాలని ఇపికాల్ ఎండీని ఆదేశించనున్నట్లు హామీ ఇచ్చారు. మంత్రిని కలసిన వారిలో కను నాగ్, నారాయణ దాస్, ప్రమోద్ తివారి, అలేక్ పాత్రొ, గోకులచంద్ర మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

- అక్కడికక్కడే మృతిచెందిన చిరువ్యాపారి



ఫుట్‌పాత్ పైకి దూసుకువెళ్లిన కంటైనర్, చక్రాల కింద మృతదేహం

రాయగడ: తెల్లవారే జీవన పోరాటానికి దిగిన చిరు వ్యాపారి.. కంటైనర్ అదుపుతప్పి దూసుకు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణంలోని ప్రజాపనుల శాఖ కార్యాలయం సమీపంలో జరిగిన ఈ ఘటన అందరినీ కలచివేసింది. దీనికి సంబంధించి ఐఐసీ కమలాకాంత్ కుహోరా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లిగుడ గ్రామానికి చెందిన బొచ్చా ప్రసాద్(53) రోజూ చేపలు తీసుకువచ్చి, రాయగడ ప్రజాపనుల శాఖ కార్యాలయం సమీపంలోని ఫుట్‌పాత్(పాదచారుల బాట)పై విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజాము 5.30 గంటలకు చేపలతో కార్యాలయం వద్దకు చేరుకున్నాడు. ఫుట్‌పాత్‌పై బండి నిలుపుదల చేస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన కంటైనర్ అదుపుతప్పి సరాసరి ప్రసాద్‌ను ఢీకొంది. దీంతో వాహనం చక్రాల కింద ఇరుక్కుపోయిన అతను.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గమనించిన కంటైనర్ డ్రైవర్.. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయి, విషయాన్ని తెలియజేశాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు.

మజ్జిగ పంపిణీలో పోలీసులు



పంపిణీని ప్రారంభిస్తున్న ఐఐసీ నాయక్

పర్లాకిమిడి: పట్టణంలో ఎండలు తీవ్రరూపం దాల్చడంతో ఆదర్శ పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఐఐసీ బుబులీ నాయక్ మంగళవారం ప్రారంభించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల దాహార్తి తీర్చేందుకు దీనిని ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

సమాచార డైరెక్టర్‌గా సరోజ్ సామల్

భువనేశ్వర్:

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ డైరెక్టర్‌గా సరోజ్‌కుమార్ సామల్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికల చేరువలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. సరోజ్ సామల్ ఎస్‌సీఎస్-2012 బ్యాచ్ అభ్యర్థి. అంతకుముందు ఝార్సుగుడ కలెక్టర్‌గా పనిచేశారు. రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ డైరెక్టర్ పదవి హోదా, బాధ్యత రాష్ట్ర ఐఏఎస్ కేడర్ జాయింట్ సెక్రటరీ పదవి, హోదాకు సమానమని ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంద్రమణి త్రిపాఠి ఎస్‌సీఎస్-2011 షెడ్యూల్డ్ కులం, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి, బలహీన వర్గాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అదనపు కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎస్సీ, ఎస్టీ పరిశోధన, శిక్షణా సంస్థ(ఎస్సీఎస్టీఆర్‌టీఐ) డైరెక్టర్‌గా ఇంద్రమణి త్రిపాఠి యథాతథంగా కొనసాగుతారు. ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు సరోజ్ సామల్, ఇంద్రమణి త్రిపాఠి 2022 ఐఏఎస్ క్యాడర్‌కు పదోన్నతి పొందారు.

కిక్కిరిసిన రోగులు



పర్లాకిమిడి జిల్లా ఆస్పత్రిలో బారులు తీరిన రోగులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి.. రోగులు, పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన అభ్యర్థులతో కిక్కిరిసిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉన్నందున అవస్థలు తప్పలేదు. దీనికి తోడు ఉక్కపోతతో గంటల తరబడి క్యూలో వేచి ఉండాల్సి వచ్చింది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోజూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. అయితే పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక పరీక్షలో మెడికల్ ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు కీలకం. ఈ సర్టిఫికెట్ల కోసం అభ్యర్థులు వార్డు బయట పడిగాపులు కాశారు. ఎండతీవ్రత, రక్తపోటు, మధుమేహం, హృద్రోగ రోగులతో ఆస్పత్రి నిండిపోయింది. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, మరింతమంది వైద్యులను నియమించాలని జిల్లావాసులు కోరుతున్నారు.



మెడికల్ సర్టిఫికెట్ల కోసం వేచి ఉన్న అభ్యర్థులు

వేసవిలో.. వినూత్న విద్య

- రాష్ట్రంలో వెకేషన్ ఎడ్యుకేషన్ విధానానికి శ్రీకారం
- వేసవి సెలవుల నుంచి ప్రయోగాత్మకంగా అమలు



భువనేశ్వర్: సెలవుల్లో బోధన సరికొత్త విధానం. దీర్ఘకాలపు వేసవి సెలవుల్లో విద్యార్థులు విద్యాభ్యాసం సమయం వృథా నివారించడం ఈ కార్యక్రమం ఏకైక లక్ష్యం. సమయం సద్వినియోగంతో బాలల్లో సృజనాత్మక ఆలోచనలకు బీజం నాటే దిశలో ప్రత్యేక పాఠ్య ప్రణాళిక రూపొందించారు. తరగతుల పాఠ్యాంశాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక రూపుదిద్దుకుంటుంది. ఈ ప్రక్రియ రాష్ట్రప్రభుత్వం విద్యాసంస్థల్లో ప్రవేశ పెట్టి అమలు చేయడం విశేషం. తొలిసారిగా ఈ ఏడాది వేసవి సెలవులు నుంచి పాఠశాల విద్యార్థులకు సెలవుల్లో చదువులు(వెకేషన్ ఎడ్యుకేషన్) ప్రవేశ పెడుతున్నట్లు రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యావిభాగం మంత్రి సమీర్‌రంజన్ దాస్ తెలిపారు. రాష్ట్రంలో తొలిసారిగా రానున్న వేసవి సెలవుల సందర్భంగా పాఠశాల విద్యార్థుల కోసం కొత్త అభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్రప్రభుత్వం వినూత్న ప్రణాళికను రూపొందించిందని వెల్లడించారు. ఈ సెలవుల విద్యా కార్యక్రమం రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రవేశ పెడుతున్నట్లు ప్రకటించారు. విద్యార్థుల్లో చురుకుదనంతో సృజనాత్మక భావాలకు పదును పెట్టడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల పురోగతిలో ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మే 4నుంచి అమలు..

రాష్ట్రంలో వెకేషన్ ఎడ్యుకేషన్ కోసం ప్రత్యేక సిలబస్ తయారు చేశారు. ఈ ఏడాది వేసవి సెలవులు నుంచి దీనిని అమలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో మే 4నుంచి ఈ బోధనా విధానానికి శ్రీకారం చుడతారు. నిర్దిష్ట తరగతి విద్యార్థులను వివిధ గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి సమూహం కార్యకలాపాలను నిర్ధారిత ఉపాధ్యాయుడు పర్యవేక్షిస్తారు. వేసవి సెలవుల నిడివిలో విద్యార్థుల చదువులను ఈ విధానంలో క్షుణ్ణంగా పర్యవేక్షిస్తారు. తల్లిదండ్రులతో సంప్రదించి విద్యార్థులు చదువులో సాధిస్తున్న పురోగతిని ఉపాధ్యాయులు తరచూ పర్యవేక్షిస్తుంటారు. సెల్‌ఫోన్ మాధ్యమంలో ఈ పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. దీనికోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన వెకేషన్ సిలబస్ ప్రకారం విద్యార్థులు పాఠాలు చదువుతున్నారో లేదో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆధ్వర్యంలో తెలుసుకుంటారు. సెలవుల్లో కూడా విద్యార్థులను చదువులో నిమగ్నమై, వారి సమయాన్ని సద్వినియోగ పరచుకునే దిశలో ప్రేరేపించడం ఈ కార్యక్రమం లక్ష్యం. వేసవి సెలవులను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకోవడం వల్ల దీర్ఘకాలంలో వారికి ప్రయోజనం చేకూరుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

అన్న మందలించాడని తమ్ముడి ఆత్మహత్య


ఉరి వేసుకున్న షకుదేబ్

మునగపాక (అనకాపల్లి జిల్లా): ఉమ్మలాడ ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రం బొలంగీర్ జిల్లా కరబాహాలీకి చెందిన యువకుడు తేల షకుదేబ్(19) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మలాడలోని తిరుమల వెంగమాంబ ఇటుక బట్టీలో ఒడిశాకు చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు కార్మికులుగా గత 4 నెలలుగా పని చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం అంతా భోజనం చేస్తున్న సమయంలో షకుదేబ్‌ను అతని సోదరుడు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి, పనిపై దృష్టి సారించాలని మందలించాడు. దీనిని తట్టుకోలేక మనస్థాపానికి గురైన షకుదేబ్.. ఇంటి నుంచి కోపంతో బయటకు వెళ్లిపోయాడు. ఎంతకూ సోదరుడు రాకపోవడంతో ఆందోళనకు గురైన అన్న పలు ప్రాంతాల్లో గాలించారు. రాత్రి 7.30 గంటల తరువాత సమీపంలోని శారదానది ఒడ్డున యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడడాన్ని గమనించారు. విషయం తెలుసుకున్న మునగపాక ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెన్నాపొడొ జీఐ ట్యాగ్ సాధనకు సన్నాహాలు


గవర్నర్ గణేషీలాల్‌కు వినతిపత్రం అందిస్తున్న నయాగడ్ బికాష్ మంచ్ బృందం

భువనేశ్వర్: నోరూరించే మిఠాయి చెన్నాపొడొ(కాల్చిన జున్ను) భౌగోళిక సూచిక రాష్ట్రానికి చెందినదే. ఈ నేపథ్యంలో గుర్తింపు సాధించేందుకు యువతరం నడుం బిగించింది. ఒడిశాకు చెందిన ప్రసిద్ధ పాలజాతి మిఠాయి ఉత్పాదన చెన్నాపొడొ జీఐ(భౌగోళిక సూచిక) హోదా కల్పించాలని నయాగడ్ సామాజిక, సాంస్కృతిక సంఘం బికాష్ మంచ్ ప్రతినిధి వర్గం రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్‌తో సంప్రదించింది. ఈ నేపథ్యంలో రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో మంగళ వారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చెన్నాపొడొ జీఐ ధ్రువీకరణతో సహా మరో 10 అభ్యర్థనలను ఈ బృందం గవర్నర్‌తో ప్రస్తావించి, వినతిపత్రం సమర్పించారు. ఈ బృందంలో సంస్థ కన్వీనర్ సుబ్రాంశు పండా, కో-కన్వీనర్ సుబ్రత్‌కుమార్ నాయక్, సభ్యులు సత్యేందు శేఖర్ మిశ్రా, రాజేష్‌కుమార్ పరిడా, అఫ్తాబ్ హుస్సేన్ ఉన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ ఖగోళ శాస్త్రవేత్త పఠానీ సామంత జన్మస్థలం ఖండపదలో శిథిలావస్థలో జీర్ణించిపోతుంది. ఈ ప్రాంతం జాతీయ వారసత్వ స్మారక చిహ్నంగా మార్చాలని యువజన సంఘం డిమాండ్ చేసింది. ఈ ప్రాంతంలో పఠాని సామంత్ర చంద్రశేఖర్ నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. కవి జాదుమణి మహాపాత్ర జన్మస్థలం ఒడిశాలోని లైబ్రరీ ఉద్యమానికి మార్గదర్శకుడు దాశరథి పట్నాయక్(దాసియా తాత), నయాగర్‌లో ప్రతిపాదిత ముంగ్ ఉత్పాదన పరిశ్రమను స్థాపన, భువనేశ్వర్ నుంచి కొంటిలో వరకు విస్తృత రహదారిని నిర్మించాలని అభ్యర్థించారు. కొంటిలో జగన్నాథ సంస్కృతికి సంబంధించిన పుణ్యక్షేత్రంగా పేర్కొన్నారు. మహానది నదిలో పర్యాటకులకు బోటింగ్ సౌకర్యం, కొంటిలొ ప్రాంతంలో పంథ్ నివాస్ ఏర్పాటు, నయాగడ్ చక్కెర కర్మాగారం పునరుద్ధరణ, చెరకు రైతులకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించాలని యువజన సంఘం తెలిపింది. ఖండపద మండలం జోగి జోగియాని అనే పురాతన బౌద్ధ విహారాన్ని మెరుగు పరచాలని, జిల్లాలోని వివిధ ప్రాంతాలలో సహజ ప్రవాహాలను విస్తరించిన రహదారితో అనుసంధానించి ఒడిశా పర్యాటక పటంలో ఉనికిని బలపరిచేందుకు కోరారు. భాపూర్ మండలం తరబాలో భారతదేశంలోని అతిపెద్ద వేడి నీటి బుగ్గను మెరుగుపరచాలి.

చారిత్రక కట్టడాలను కాపాడుకుందాం

గార: చారిత్రక కట్టడాలను కాపాడుకుందామని పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ సూపరింటెండెంట్ డాక్టర్ గోపినాథ్ జెనా అన్నారు. మంగళవారం ప్రపంచ వారసత్వ సంపద దినోత్సవం సందర్భంగా శాలిహుండం బౌద్ధారామాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితిలో 1982లో చారిత్రక కట్టడాల కోసం ప్రత్యేకంగా వరల్డ్ హెరిటేజ్ డే ఉండాలని తీర్మానం చేసి 1983 నుంచి అమలు చేస్తున్నట్లు చెప్పారు. చారిత్రక కట్టడాలపై అవగాహన లేక చాలామంది ధ్వంసం చేస్తున్నారని చెప్పారు. చారిత్రక ఆస్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం బోరవానిపేట సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శాలిహుండం బౌద్ధారామాల విశిష్టత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ కె.వీరాంజనేయులు, డాక్టర్ దీబానెంద్రనాథ్ బోహి, జి.సూర్యప్రకాష్, జె.కమలహాసన్, బి.నవీన్‌కుమార్, ఎం.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథకాలకు రూ.6 కోట్లు

- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వెల్లడించిన ఎమ్మెల్యే తారాప్రసాద్
- జయపురం అభివృద్ధికి అన్ని విధాలా కృషి: ఎంపీ ఉలక


ఆస్పత్రి భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం:

పట్టణంలో వివిధ పథకాలు అభివృద్ధి పరిచేందుకు రూ.6 కోట్ల 70 లక్షలు వెచ్చించనున్నట్లు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణాపతి వెల్లడించారు. జయపురం మున్సిపాలిటీ కౌన్సిల్ సభాగృహంలో చైర్మన్ నరేంద్రమహంతి అధ్యక్షతన మంగళవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్నాథ సాగర్ ఆధునీకరణ కోసం రూ.కోటి 20 లక్షలు, జిల్లా ఉపాధ్యాయ శిక్షణ ఇనిస్టిట్యూట్ ఆడిటోరియం నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలు, ప్రతాప్ నారాయణ సింగ్‌దేవ్ ఆడిటోరియం పునరుద్ధరణకు రూ.50 వేలు, కుంతర్‌కాల్ గ్రామంలో ప్రతిపాదిత గోశాల నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలు, పాత దైనిక బజార్‌లో మాంసం విక్రయ మార్కెట్ ఏర్పాటుకు రూ.కోటి 50 లక్షలు మంజూరు చేయాలని రాష్ట్ర పట్టణ, గృహ విభాగానికి విన్నవించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రూ.6 కోట్ల 70 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక మాట్లాడుతూ ఎంపీ నిధి నుంచి మంజూరైన అభివృద్ధి పనుల వినియోగ పత్రాలను అందజేయాలని సూచించారు. అలాగే కొత్త పథకాలు ప్రతిపాదిస్తే, ఎంపీ నిధి నుంచి మంజూరు చేస్తామని తెలిపారు.

ప్రతిపాదనలకు ఆమోదం..

కౌన్సిల్ సమావేశంలో పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు. వివిధ ప్రాంతాల్లో రోడ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు టాటా పవర్ కంపెనీకి విన్నవించారు. పట్టణంలో నీటి సమస్య తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో వెంటనే పీహెచ్‌డీ అధికారులు పాడైన పైప్‌లైన్లను మరమ్మతు చేయాలన్నారు. పట్టణ నీటి సమస్య పరిష్కారానికి 5వేల లీటర్ల సామర్థ్యంతో 3 నీటిట్యాంకుల ఏర్పాటుకు సమావేశం తీర్మానించింది. అలాగే మున్సిపాలిటీ ఆధీనంలోని ప్రైవేట్ బస్టాండ్‌ను పునఃనిర్మాణం చేయాలని, పారాబెడ కూడలి వద్ద డాక్టర్ అంబేడ్కర్ శిలా విగ్రహాన్ని బిజూ పట్నాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందులో పట్టణంలో పలు పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, వైస్ చైర్మన్ బి.సునీత, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులు, సిబ్బందికి నూతన భవనాలు..

జయపురం: స్థానిక పట్టణంలోని కొరాపుట్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్మించిన 2 నూతన భవనాలకు ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిలో ఒకటి రోగులతో వచ్చిన సహాయకుల విశ్రాంతి నిమిత్తం, మరొకటి ఆస్పత్రి సిబ్బంది వినియోగానికని తెలిపారు. మూడు అంతస్తుల సిబ్బంది భవనానికి రూ.2 కోట్లు, సహాయకుల 2 అంతస్తుల భవనానికి రూ.కోటి 20 లక్షలు వెచ్చించినట్లు వెల్లడించారు.


జయపురంలో నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనాలు

ఇవి రోగుల సహాయకులు, వైద్యులు, సిబ్బందికి ఎంతో ఉపయోగ పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దూరప్రాంతాల నుంచి జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు ఎటువంటి సౌకర్యం లేకపోవడంతో రోడ్లు, చెట్ల కింద తల దాచుకోవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. తాజా నిర్మాణాలతో ఆ సమస్య తీరుతుందని ఆనందం వ్యక్తంచేశారు. భవనంలో రోగుల సహాయకులు 50మంది విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని ఆర్అండ్‌బీ అధికారులు వెల్లడించారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వైద్యులు, సిబ్బంది పట్టణంలోని హోటళ్లలో ఉండాల్సి వస్తోందని, ఇకపై ఆ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢి, జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్ మిశ్రా, మేనేజర్ రూపసి మధుమిత నాయక్, రాజా ఆచార్య, నాయకులు దేవాశిశ్ పండా, ఆర్అండ్‌బీ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు

బెంగళూర్ జంటకు చిన్నారి దత్తత


బిడ్డతో బెంగళూర్‌కు చెందిన జంట

మల్కన్‌గిరి: జిల్లా కలెక్టర్ విశాల్‌సింగ్ ఆధ్వర్యంలో బెంగళూర్‌కు చెందిన ఓ జంట మల్కన్‌గిరిలో ఓ చిన్నారిని దత్తత స్వీకరించారు. పరివర్తన్ సంస్థ డైరెక్టర్ నిత్యానంద్ ప్రధాన్ సమక్షంలో ఆకాక్ అనే 3నెలలు చిన్నారిని రాజ్యలక్ష్మి, సూదుల్ ముత్తు అనే జంటకు అప్పగించారు. దీంతో లబ్ధిదారు జంట ఆనందం వ్యక్తం చేశారు.

'ఏసీఎఫ్ సౌమ్యరంజన్ కేసు పునః విచారించాలి'


భార్య విద్యాభారతితో ఏసీఎఫ్ సౌమ్యరంజన్ మహాపాత్రో(ఫైల్)

పర్లాకిమిడి: జిల్లా అటవీశాఖ ఏసీఎఫ్(అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సౌమ్యరంజన్ మహాపాత్రో 2021 జూలై 21న అనుమానాస్పదంగా మృతిచెందిన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ కేసు మిస్టరీని ఛేదించడంలో దర్యాప్తు(సిట్) అధికారులు విఫలమయ్యారు. అయితే మృతుడు తండ్రి అభిరాం మహాపాత్రో కేసుపై పునః విచారణ చేయాలని పర్లాకిమిడి ఎస్‌డీజేఎం కోర్టులో కోరారు. దీనిని స్వీకరించిన న్యాయస్థానం.. ఏప్రిల్ 27కు విచారణకు రావాల్సిందిగా నిందితులకు నోటీసులు పంపారు. కేసులో అప్పటి డీఎఫ్ఓ సంగ్రాంకేసరి బెహరా, భార్య విద్యాభారతీ పండా, వంటవాడు మన్మథ ఖంబలకు నిందితులుగా చేర్చారు. 95శాతం శరీర భాగాలు కాలిన మృతదేహాన్ని ఆస్పత్రిలో చేర్చగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

గంగపుత్రుల బెంగ తీరేలా


బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్న స్థలమిది

- రూ. 366కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్
- నేడు సీఎం చేతుల మీదుగా ఫిషింగ్ హార్బర్‌కు శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మనకంటూ ఓ హార్బర్ రానుంది. వేట కోసం వేరే రాష్ట్రాలు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న గంగపుత్రుల బెంగ తీరేలా బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్నారు. జిల్లాలో పలాస నియోజక వర్గ పరిధిలోని తీరప్రాంత మత్స్యకారుల కోసం ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. కానీ ఏ ఒక్క ముఖ్యమంత్రి ఆ దిశగా ప్రయత్నించలేదు. కానీ సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టితో ప్రస్తుతం వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీ నిర్మితమవుతోంది. అలాగే ఫిషింగ్ హార్బర్ ప్రతిపాదన కూడా కలగానే మిగిలిపోయింది. ఎట్టకేలకు ఆ కల నెరవేరనుంది. విశ్వసముద్ర సాగర మాల ప్రాజెక్టులో భాగంగా మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తోంది. అందులో భాగంగా 193 కిలోమీటర్ల తీర ప్రాంతంలో సరాసరి లక్షా 95వేల మెట్రిక్ టన్నుల మత్స్య సంపద లభిస్తున్న మన జిల్లాలో కూడా ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. బుడగట్లపాలెం ప్రాంతం చేపలు వేటకు అనువైనదిగా గుర్తించి ఎంపిక చేశారు. రూ.366కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. టెండర్లు కూడా ఖరారయ్యాయి. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. మత్స్య సంపదకు మంచి మార్కెట్ కల్పించేందుకు హార్బర్ ఉపయోగపడుతుంది. చేపల వేట, ఉత్పత్తి, అమ్మకం పెరుగుతాయి. ఇది పూర్తయితే మత్స్యకారుల సంపదకు మంచి మార్కెట్ వస్తుంది. టూరిజం అభివృద్ధి చెందుతుంది. ప్రాంతీయ ప్రగతి సాధ్యపడుతుంది. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు, రోడ్లు అభివృద్ధి చెందుతాయి. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట నియోజకవర్గాల మత్స్యకారులకు ఈ హార్బర్ వల్ల ప్రయోజనం కలగనుంది. వలస పోవాల్సిన అవసరం ఉండదు.

వైఎస్సార్ సీపీ వచ్చాక..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మత్స్యకారులకు ఎంతో మేలు జరిగింది. కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ అమలు చేసినప్పుడు జిల్లాకు చెందిన మత్స్యకారులు గుజరాత్, చెన్నై తదితర ప్రాంతాల్లో చిక్కుకున్నారు. రూ. 3కోట్లు ఖర్చు పెట్టి జిల్లాకు చెందిన 3064 మంది మత్స్యకారులను 46 బస్సుల ద్వారా తీసుకొచ్చారు.

- వేట నిషేధ కాలంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట 14043 మందికి రూ.10వేలు చొప్పున వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తోంది. ఈ ఏడాది ఆ సంఖ్య 17,136కు పెరగనుంది. గత టీడీపీ ప్రభుత్వంలో వేట విరామం సమయంలో రూ. 4వేలు మాత్రమే ఇచ్చేవారు.
- బోట్ల కోసం లీటర్‌కి రూ. 9చొప్పున డీజిల్ సబ్సిడీ కూడా ఇస్తోంది.
- మూడు చక్రాల మోటార్ సైకిళ్లు లబ్ధిదారులకు అందజేశారు.
- నియోజకవర్గానికొక ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేశారు.
- చేపల చెరువుల తయారీకి మట్టి నమూనా సేకరించి,అనువైనదా?కాదా ? గుర్తించే ప్రక్రియ చేపడుతున్నారు.
- మత్స్యకారుల సంక్షేమం క్షేత్రస్థాయిలో అందుతుందో తెలుసుకునేందుకు 66 మంది సాగర మిత్ర ఉద్యోగులను నియమించారు.
- గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్ ఉద్యోగులను నియమించారు.

హక్కుల సాధనకు సామూహిక పోరాటం


మహాసభలో పాల్గొన్న యాదవ సంప్రదాయ ప్రజలు

- అవిభక్త కొరాపుట్ జిల్లాల యాదవ మహాసభ తీర్మానం


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యాదవ సమాజ్ ప్రతినిధులు

జయపురం: యాదవ సంప్రదాయ ప్రజల హక్కుల సాధన, పరిరక్షణకు కోసం సామూహిక ఉద్యమానికి సిద్ధం కావాలని యాదవ్ సమాజ్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. జయపురంలో జరిగిన అవిభక్త కొరాపుట్ జిల్లాల యాదవ మహాసభలో యాదవ, గౌడ సంప్రదాయ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావించారు. సంఘం సాధారణ కార్యదర్శి రాజేంద్ర గౌఢ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడుతూ సమైక్యత తోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ సులోచన దాస్ హాజరై, మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 28శాతం యాదవులు ఉన్నారని, అయితే తదనుగుణంగా అధికారం చేకూరలేదని అభిప్రాయం వ్యక్తంచేశారు. యాదవ సమాజ్ సంస్కృతి, సంప్రదాయాలు మరుగున పడుతున్నాయని, వీటిని పరిరక్షించుకోవడంతో పాటు భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువ యాదవ సమాజ్ అధ్యక్షుడు ప్రణదీప్ బెహరా మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను సంప్రదాయ యాదవులు పొందలేకపోతున్నారన్నారు. దీంతో విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వెనుకంజలో ఉన్నామని విచారం వ్యక్తంచేశారు. అన్ని రంగాలలో హక్కుల సాధనకు సామూహికంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కొరాపుట్ జిల్లా యాదవ సమాజ్ అధ్యక్షుడు మదనమోహన నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో కొట్‌పాడ్ యాదవ సమాజ్ నేతలు పదలామ్ గౌఢ, బలరాం గౌఢ, తులారాం గౌఢ, త్రినాథ్ గౌఢ, అభి నాయక్, సాహెబ్ గౌఢ, రాజేంద్ర గౌఢ, చంద్రశేఖర గౌఢ, శ్యాంసుందర గౌఢ, ధనపతి గౌఢ, మోహన గౌఢ, కైలాశ గౌఢ, రామనాథ్ గౌఢ, పరమేశ్వర పాత్రొ, వేలాదిమంది సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఝార్సుగుడలో దీపాలి దాస్ నామినేషన్

- భారీ ర్యాలీ చేపట్టిన బీజేడీ శ్రేణులు
- హాజరైన పలువురు మంత్రులు, కీలక నాయకులు


నామినేషన్ పత్రాలు అందిస్తున్న దీపాలి దాస్

భువనేశ్వర్: ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ముఖచిత్రం దాదాపు స్పష్టమైంది. అధికార పక్షం తరఫున హత్యకు గురైన దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె దీపాలీ దాస్ ప్రత్యక్ష పోరుకు బరిలోకి దిగింది. ఆమె మంగళవారం తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 29న కిషోర్‌దాస్ హత్యకు గురవ్వడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు దీపాలీదాస్ మా పట్నేశ్వరి, శ్రీగణేష్, మహదేవ్‌ల మందిరాలు సందర్శించి దేవుళ్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు తన తండ్రి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు బరిలోకి దిగినట్లు ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. తండ్రి తరహాలో గుర్తింపు పొందే రీతిలో ప్రజాసేవలో పాల్గొనే సంకల్పంతో పోటీకి సిద్ధమైనట్లు తెలిపారు. రాజకీయాల్లోకి తాను చేరాలనేది తన తండ్రి సంకల్పనగా గుర్తు చేసింది. తదనంతరం దాస్ సంకల్ప కార్యసాధకురాలిగా ఎదగాలని తండ్రి ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో మహిళల అభ్యున్నతికి కృషి చేయడం తొలి కర్తవ్యమన్నారు. దీపాలి దాస్ నామినేషన్ దాఖలు ఊరేగింపులో బీజేడీ ప్రధాన కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్‌దాస్, పార్టీ పరిశీలకులు ప్రసన్న ఆచార్య, దేవీప్రసాద్ మిశ్రా, శారదాప్రసాద్ నాయక్, మంత్రులు నిరంజన్ పూజారి, అరుణ్ సాహు, టుకుని సాహు, రీతా సాహు, ప్రతాప్ జెనా, ప్రతాప్‌కేశరి దేవ్, పద్మనాభ్ బెహరా, స్నేహాంగిని చురియా, పుష్పేంద్ర సింగ్ దేవ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిముఖ పోటీ..

బీజేడీ అభ్యర్థిగా దీపాలి దాస్ నామినేషన్ దాఖలు పూర్తి కావడంతో ఝార్సుగుడ అసెంబ్లీ ఉప ఎన్నికలో త్రిముఖ పోటీ వాతావరణం దాదాపు స్పష్టమైంది. ఇంతకుముందే భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు పూర్తి చేశారు. బీజేపీ అభ్యర్థిగా టొంకొధొరొ త్రిపాఠి, కాంగ్రెస్ అభ్యర్థిగా తరుణ్‌పాండే బరిలో సిద్ధంగా ఉన్నారు. వీరి మధ్య పోరు హోరాహోరీగా కొనసాగుతుందని విశ్లేషకుల అంచనా. ఎన్నికల ప్రచారంలో సత్తా చాటుకునే దిశలో దీపాలి దాస్ బలంగా అడుగులు వేస్తున్నారు. దివంగత నాయకుని కుమార్తెగా నియోజకవర్గంలో తనకంటూ ప్రత్యేక ఉనికిని సొంతం చేసుకున్నారు. ఆమె గెలుపు కోసం అనుభవజ్ఞులైన బిజూ జనతాదళ్ నాయకులు 4 మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో పాగా వేసి, ప్రత్యేకంగా ప్రచారం చేస్తున్నారు. వీరికి మరింత బలంగా మహిళా సమూహాలు, తండ్రిని కోల్పోయిన సానుభూతితో ఇటీవల ఇరుగు-పొరుగు పదంపూర్, బ్రజరాజ్‌నగర్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం దీపాలి దాస్‌ను మరింత ఉత్సాహంతో ప్రేరేపిస్తోంది.

తూర్పు తీరం.. ప్రగతి సిందూరం

- ఉత్తరాంధ్రకే తలమానికంగా మూలపేట పోర్టు
- రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందే పోర్టుగా నిలిచే అవకాశం
- సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన నేడు


మూలపేట వద్ద పైలాన్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ, మారీటైం బోర్డు చైర్మన్ వెంకటరెడ్డి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లా ప్రజల దశాబ్దాల కల నెరవేరుతోంది. జిల్లాకే కాదు ఉత్తరాంధ్ర మొత్తానికి తలమానికంగా నిలిచేలా మూలపేట పోర్టు నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టుకు సీఎం చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన జరగనుంది. పోర్టుకు కావాల్సిన భూ సేకరణ ఇప్పటికే జరిగింది. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో ఎకరాకు రూ.25 లక్షల పరిహారం చెల్లించారు. ఈ నిర్వాసితుల కోసం ఎకరాకు రూ.26 లక్షలు ఇచ్చి కె.నౌపడ సమీపంలో భూమిని కొనుగోలు చేశారు. రూ.35 కోట్ల వ్యయంతో అక్కడ ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించనున్నారు. దాదాపు వెయ్యి ఎకరాల్లో పోర్టు రాబోతోంది.

ప్రస్తుతానికి తూర్పు తీరంలో ఉత్తరాంధ్రలో ప్రస్తుతం విశాఖపట్టణం పోర్టు ఒక్కటి మాత్రమే జల మార్గంలో వ్యాపార లావాదేవీలకు అనుకూలంగా ఉంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లకు జల మార్గంలో అతి తక్కువ దూరం కలిగిన పోర్టు మరొకటి లేదు. దీంతో రాష్ట్రంలో నాలుగు చోట్ల పోర్టులు నిర్మిస్తున్నా అత్యంత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న పోర్టుగా మూలపేట పోర్టును భావిస్తున్నారు. టెక్కలి ప్రాంతంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నీలి గ్రానైట్ తదితర ఖనిజాలు లభ్యమవుతున్నాయి. అలాగే 65 గ్రానైట్ క్వారీలు, వందకుపైగా పాలిషింగ్ యూనిట్లు ఇక్కడే ఉన్నాయి. ఈ గ్రానైట్‌ను అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ చేసేందుకు పోర్టు ఉపయోగపడుతుంది. మత్స్యసంపద గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఇక పలాస జీడిపప్పు ఎగుమతులు, దిగుమతులకు కూడా ఈ పోర్టు ఉపయోగపడుతుంది.

పోర్టు స్వరూపమిది..

మూలపేట పోర్టును నిర్మించేందుకు ఇప్పటికే రూ.4,361.91కోట్లతో ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో నిర్మిస్తున్న ప్రాజెక్టును రూ.2,949.70కోట్లతో కాంట్రాక్ట్‌ను ఖరారు చేసింది. పోర్టు వార్షిక సామర్థ్యం 83.3మిలియన్ టన్నులు కాగా, తొలి దశలో 23.5మిలియన్ టన్నుల సామర్థ్యంతో నాలుగు బెర్తుల నిర్మాణం, ఇతర మౌలిక వసతుల కల్పన జరుగుతాయి. నాలుగు బెర్తుల్లో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గు, ఇంకొకటి కంటైనర్‌తో పాటు ఇతర ఎగుమతి, దిగుమతులకు వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 25వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. అప్రోచ్ ఛానెల్ 3.3 కిలోమీటర్లు, జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ 13.6కిలోమీటర్ల నాలుగు లైన్ల రహదారి, 10.6 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణం చేపట్టనున్నారు. గొట్టా బ్యారేజీ నుంచి 0.5ఎంఎల్‌డీ నీటిని అక్కడికి సరఫరా చేయనున్నారు. నిర్మాణానికి అవసరమైన ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్, మారిటైమ్ బోర్డు ద్వారా బ్యాంకుల నుంచి రుణ ఆమోదం కూడా వచ్చింది.

టెండర్లు పూర్తి

పోర్టు నిర్మాణానికి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఫేజ్-1 పనులను చేపట్టేందుకు విశ్వ సముద్ర గ్రూప్ కాంట్రాక్ట్ దక్కించుకుంది. తొలి దశ నిర్మాణానికి ప్రైవేటు, ప్రభుత్వ భూమి, కోస్టల్ తీర ప్రాంత భూములను సేకరించింది. టెక్కలి మండలం బూరగాం, పాత నౌపడ, కొండ భీంపురం, నందిగాం మండలంలోని డిమ్మిలాడ నర్సీపురం, దేవలబద్ర, సంతబొమ్మాళి మండలం మర్రిపాడు, కస్పా నౌపడ, రాజపురంలో రైతులతో సంప్రదింపులు చేసి ప్రభుత్వ భూములను సేకరించింది. సేకరించిన భూముల్లో రోడ్డు కనెక్టివిటీ కోసం 327.75 ఎకరాలు, రైల్వే కనెక్టివిటీ కోసం 100.27ఎకరాలు, మిగతాది పోర్టు కోసం వినియోగించనున్నారు.

మెరుగైన పరిహారం..

పోర్టు కోసం భూములు ఇచ్చిన విష్ణుచక్రం గ్రామానికి చెందిన వారికి కె.లింగుడు, సంతబొమ్మాళి, మూలపేటకు చెందిన వారికి కె.లింగుడు, ఇజ్జువురంలో ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మించనున్నారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారంతో పాటు ఇళ్లు కోల్పోయిన వారి ఇంట్లో ఉన్న 18 ఏళ్లు పైబడిన 590మందికి రూ. 10లక్షలు చొప్పున పీడీఎఫ్ ప్యాకేజీ ఇస్తున్నారు. 594 మందికి ఇంటి నిర్మాణాం కోసం ఐదు సెంట్ల చొప్పున భూమి ఇచ్చి మోడల్ ఆర్ఆండ్ఆర్ కాలనీగా తీర్చిదిద్దనున్నారు. ఇంట్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తున్నారు.

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి విశిష్ట కుంకుమార్చన చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

జాబ్‌మేళా రేపు

విజయనగరం రూరల్: ప్రైవేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ బ్యాంకింగ్ సంస్థలో 60 ఉద్యోగాల భర్తీకి ఈ నెల 20న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్లు (బీడీఎం)-10, ఫైనాన్స్ కన్సల్టెంట్ పోస్టులు-50 భర్తీ చేస్తామన్నారు. బీడీఎం ఉద్యోగాల పోస్టులకు కనీస విద్యార్హత డిగ్రీ కలిగి ఉండాలని, వయస్సు 23 నుంచి 25 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. సేల్స్‌లో రెండేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యముంటుందన్నారు. వేతనం నెలకు రూ.23వేల నుంచి రూ.25 వేల మధ్య ఉంటుందని తెలిపారు. స్త్రీ, పురుష అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావాలని తెలిపారు. ఎఫ్‌సీ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీ విద్యార్హతతో పాటు 23 నుంచి 65 ఏళ్ల లోపు వయస్సుగల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20న 10 గంటల నుంచి వారి బయోడేటాతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార దిశగా నిరసనలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 29 వ తేదీ వరకు ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్ ప్రకారం నిరసన కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ చైర్మన్ కేవీరమణరాజు, కార్యదర్శి ఎ.విజయ్‌కుమార్, రెవెన్యూ సంఘం అధ్యక్షుడు టి.గోవింద్, ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.పద్మనాభం, ఉపాధ్యాయ సంఘం నాయకులు కల్పన, శంకర్, వివిధ శాఖల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సంతృప్తి కర పరిహారం అందజేయాలి



భూసేకరణ కోసం రైతులతో మాట్లాడుతున్న డీటీ భవ్యశ్రీ

దత్తిరాజేరు: పెదమానాపురం వద్ద రైల్వే మూడో లైన్ కోసం భూములు, ఇళ్లు కోల్పోతున్న మాకు సంతృప్తి కరమైన నష్ట పరిహారం అందజేయాలని రైతులు కోరారు. ఈ మేరకు మంగళవారం వాసవీ కల్యాణ మంటపంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయం డీటీ భవ్యశ్రీ మాట్లాడుతూ మండల పరిధిలో చేపడుతున్న పనులకు 3.21 ఎకరాల భూమి సేకరణ అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ ధర ఎకరాకు రూ.19 లక్షలతో పాటు అదనంగా రెండింతలు కలిపి రైతులకు అందచేయనున్నట్లు చెప్పారు. అయినప్పటికీ రైతులు సంతృప్తి చెందక పోడంతో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను చేరవేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వీఆర్వో అసిరివాడు, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్‌జేడీ

కొత్తవలస: మండలంలోని గిడిజాల రోడ్డు కుమ్మరబంజిరీ వద్ద గల వియ్యంపేట ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆ శాఖ ఆర్‌జేడీ జి.చిన్నయిదేవి మంగళవారం సందర్శించారు. ముందుగా కార్యాలయంలో పలు రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ కార్యాలయానికి వస్తున్న ఫుడ్ మెటీరియల్స్ వివరాలు, కేంద్రాలకు పంపిణీ చేసే వివరాలపై ఆరా తీశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సాంకేతిక విద్యకు సోపానం పాలిటెక్నిక్

- జాబ్‌మేళాలతో ఉపాధి, ఉద్యోగావకాశాలు
- కోర్సు పూర్తి చేశాక ఇంజినీరింగ్‌లో ప్రవేశం ఈజీ
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



కంప్యూటర్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: సాంకేతిక విద్యకు తొలి మెట్టుగా పాలిటెక్నిక్ కళాశాలలు నిలుస్తున్నాయి. ఇంజినీరింగ్ విద్య కంటే తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. పాలిటెక్నిక్ చదివిన వారికి భారీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఖాయంగా లభిస్తున్నాయి. దీంతో పదో తరగతి పూర్తయిన వెంటనే విద్యార్థులు పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అందుబాటులో 28 కోర్సులు

ఉమ్మడి జిల్లాల పరిధిలో 5 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 17 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో 28 కోర్సులు అందుబాటులో ఉండడంతో విద్యార్థులు నచ్చిన కోర్సును ఎంపిక చేసుకుని చేరుతున్నారు. కంప్యూటర్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, తదితర డిప్లమో కోర్సులను పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్నాయి. 3 ఏళ్ల పాటు ఈ కోర్సులను చదవాల్సి ఉంటుంది. అయితే పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు సీప్‌లో ర్యాంక్ సాధించాల్సి ఉంటుంది.

ప్రవేశం.. అర్హతలు

విద్యార్థులు పదో తరగతి అర్హతతో పాలిసెట్ రాసి, ర్యాంకు ఆధారంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందాల్సి ఉంటుంది. స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో నిర్వహించే పాలిసెట్- 2023 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30 ఆఖరి తేదీ కాగా, వచ్చే నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలో 22 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరగనుంది.

ఏటా 5,600 మంది చేరిక

ఉమ్మడి జిల్లా పరిధిలో 5 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 1100 మంది వివిధ కోర్సులలో చేరుతుండగా 17 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 4,500 మంది వివిధ కోర్సులలో చేరుతున్నారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం

తక్కువ ఖర్చుతో ఇంజినీరింగ్ విద్య వైపు అడుగులు వేసేందుకు పాలిటెక్నిక్ విద్య ఉపయోగపడడంతో గ్రామీణ, మధ్య తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్య వరంగా ఉంటుందని చెప్పొచ్చు. పాలిటెక్నిక్ విద్య మూడేళ్ల కోర్సు పూర్తయితే ఈ సెట్ పరీక్ష రాసి నేరుగా ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో విద్యార్థులు చేరొచ్చు. పాలిటెక్నిక్ కోర్సులో ప్రాక్టికల్స్‌కు ఎక్కువగా అవకాశం ఉండడంతో విద్యార్థులకు త్వరితగతిన కంపెనీల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయి. డిమాండ్ ఉన్న కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు కార్పొరేట్ కంపెనీలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

పాలిటెక్నిక్ కోర్సులతో మేలు



పాలిటెక్నిక్ విద్యతో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే పలు జాబ్ మేళాలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయి. తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య అందించడంతో పేద విద్యార్థులకు మేలు కలుగుతోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 12 డిప్లమో కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

– జె.ఆశారమణి, ప్రిన్సిపాల్, ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

క్రీడల అభివృద్ధికి పెద్దపీట



ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- రూ.28 లక్షలతో ఇండోర్ స్టేడియం అభివృద్ధికి శంకుస్థాపన

విజయనగరం: నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని, అందులో భాగంగా క్రీడల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో రూ.28 లక్షలతో చేయ తలపెట్టిన వివిధ అభివృద్ధి పనులకు కోలగట్ల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామికి క్రీడాకారులు, జిల్లా ప్రాధికార సంస్థ అధికారులు, సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఇండోర్ స్టేడియం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ గతంలో చేపట్టిన పరిశీలనలో ఇండోర్ స్టేడియంలో మరమ్మతు పనుల విషయమై క్రీడాకారులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే స్పందించి మరమ్మతుల అంచనా వేయమని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించామన్నారు. దీంతో గాల్వనైజెడ్ రూఫ్, సీలింగ్, పెయింటింగ్, సీసీ డ్రైన్ వంటివి ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనే ఎజెండా

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ఎజెండాగా తమ పాలన సాగిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఆయా సందర్భాలలో చెరువులు, క్రీడాప్రాంగణాలు, పార్కులు వంటివి పునర్నిర్మిస్తూ నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇప్పటికే ప్రధాన జంక్షన్‌ను అభివృద్ధి చేశామని, రూ.18లక్షలతో కోడి రామ్మూర్తి వ్యాయామశాల, రాజీవ్ స్టేడియం వంటి క్రీడా ప్రాంగణాలు కూడా అభివృద్ధి చేసి ప్రజా వినియోగంలోకి తెచ్చామన్నారు. కల్పిస్తున్న సౌకర్యాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకాశం పార్కును అభివృద్ధి చేసి త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ పార్కును మహిళా పార్కుగా తీర్చిదిద్ది కేవలం మహిళలకే ప్రవేశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళలకు అవసరమైన వ్యాయామశాల, వాకింగ్ ట్రాక్, ఈతకొలను వంటివి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు, వైఎస్‌ఆర్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ ఆశపు సుజాత, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారు నాయుడు, సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వీఎస్.ప్రసాద్, సురేష్, ఎంకేబీ శ్రీను, తోనంగి జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో 'బిజినెస్ మోడల్ కాన్వాస్' సదస్సు



మాట్లాడుతున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ జితేంద్ర మిశ్రా

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం వ్యాపార నమూనా కాన్వాస్ వర్క్‌షాప్ జరిగింది. రీసోర్స్ పర్సన్‌గా కేంద్రియ గిరిజన యూనివర్సిటీ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ జితేంద్ర మిశ్రా సదస్సులో మాట్లాడుతూ వ్యాపార వ్యవస్థాపకుడు దేశ ఆర్థిక వ్యవస్థను మార్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తాడన్నారు. సమాజంలోని అవసరాలను అర్థం చేసుకుని దానికి అనుగుణంగా వ్యాపార నమూనాను తయారు చేసుకుని ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామ్మూర్తి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ ఎస్.వరూధిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

66 కిలోల గంజాయితో నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: రైల్వేస్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద నాలుగు బ్యాగ్‌లతో గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని 66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రిజర్వేషన్ కౌంటర్ వద్ద మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో ఒక వ్యక్తి నాలుగు బ్యాగ్‌లతో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు అందుకున్న సమాచారంతో వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్న క్రమంలో నిందితుడి దగ్గరున్న బ్యాగ్‌లను తనిఖీ చేయగా అందులో 66 కేజీల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. నిందితుడిని ప్రశ్నించగా పశ్చిమబెంగాల్‌కు చెందిన మౌలాభోక్షా అని తెలిసినట్లు సీఐ చెప్పారు. విశాఖ నుంచి కోల్‌కత్తా రవాణా చేస్తుండగా గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులున్నారని, వారికోసం గాలింపు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఎస్సై మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఓను కలిసిన నూతన ఉపాధ్యాయులు



డీఈఓ లింగేశ్వరరెడ్డిని కలిసిన ఉపాధ్యాయులు

విజయనగరం పూల్‌బాగ్: సరిగ్గా 25 ఏళ్లక్రితం ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకున్న అభ్యర్థులు 1998 ఏప్రిల్ 19న ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు హాజరయ్యారు.ఆ పరీక్ష జరిగి నేటికి 25 ఏళ్లు (సిల్వర్‌జూబ్లీ)పూర్తికానున్నాయి. అయితే చాలా మంది ఉద్యోగాల్లో జాయిన్ అయ్యారు. కొంత మందికి అన్యాయం జరగడం వల్ల కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది.ఆ తీర్పు వెలువడడానికి చాలా ఏళ్లు పట్టింది. ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 98 డీఎస్సీ అభ్యర్థులంతా కలిసి వారి సమస్యను విన్నవించారు. ఆ తర్వాత కాలంలో ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన వైస్ జగన్‌మోహన్‌రెడ్డి 1998 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జిల్లాలో ఉన్న 488 మంది గతవారం ఉపాధ్యాయులుగా విధుల్లో జాయిన్ అయ్యారు. వారి ఆనందానికి అవధుల్లేవు. ఈ సందర్భంగా వారంతా మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి బి లింగేశ్వరరెడ్డిని కలిశారు. కార్యక్రమంలో పి వెంకటరావు, పి రామారావు, ఎల్ వెంకటరమణ,ఎం అప్పలనాయుడు, ఎమ్ ఎస్ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 23 నాటికి శతశాతం రీ సర్వే పూర్తి చేయాలి

- సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు



తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు టి.తివిక్రమరావు

వేపాడ: జిల్లాలో నిర్వహిస్తున్న రీ సర్వేను అక్టోబర్ 23 నాటికి శతశాతం పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సహాయ సంచాలకులు(సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్') టి.తివిక్రమరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం వేపాడ మండలంలో రీ సర్వే పూర్తి అయిన రాయుడుపేట గ్రామాన్ని సందర్శించి సర్వేరాళ్లు వేయడాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 983 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 9,51,000 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉందని, ఇప్పటివరకు 913 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి అయ్యిందన్నారు. జిల్లాలో హిల్‌టాప్ ఏరియాకు సంబంధించి 25 గ్రామాల్లో డ్రోన్ సర్వే చేయాల్సి ఉందన్నారు. మొదటి విడతలో జిల్లాలో 179 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 85వేల ఎకరాల్లో (జిరాయితీ, ప్రభుత్వం, పోరంబోకు) రీ సర్వే పూర్తయిందన్నారు. బొబ్బిలి డివిజన్‌లో 100 గ్రామాలు, విజయనగరం డివిజన్‌లో 79 గ్రామాల్లో సర్వే జరిగిందన్నారు. రెండో విడతలో 278 రెవెన్యూ గ్రామాల్లో సర్వే జరుగుతోందన్నారు. 475 మంది గ్రామ సర్వేయర్లు, 50 మంది సీనియర్ సర్వేయర్లు, 300 మంది వీఆర్‌ఓలతో పాటు రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపతహసీల్దార్ సన్యాసినాయుడు, మండల సర్వేయర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం అక్షరాస్యత దిశగా అడుగులు

- తాజా సర్వేల్లో జిల్లాలో 36,292 మంది మాత్రమే నిరక్షరాస్యులు
- వీరిలో 50 ఏళ్లలోపు వయస్సువారు 13,502 మంది
- చిట్టి గురువులు కార్యక్రమంతో శతశాతం అక్షరాస్యత సాధనకు అడుగులు
- వయసు ఆధారంగా మూడు కేటగిరీలుగా నిరక్షరాస్యుల విభజన



నిరక్షరాస్యులకు తరగతులు నిర్వహిస్తున్న చిట్టిగురువులు

వయసుల వారీగా జిల్లాలో నిరక్షరాస్యుల సంఖ్య

వయసు వారీ ..	గ్రామీణం	పట్టణ ప్రాంతం
15-35	2,114	910
35-50	10,272	3,230
50 ఏళ్ల పైబడి	14,048	3,502
వివరాలు లేనివారు	1,474	742
మొత్తం నిరక్షరాస్యులు	27,908	8,384

విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లా శతశాతం అక్షరాస్యత దిశగా అడుగులు వేస్తోంది. సంపూర్ణ అక్షరాస్యత జిల్లా అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలనిస్తున్నాయి. సచివాలయాల సిబ్బంది ఈ ఏడాది మొదట్లో నిర్వహించిన సర్వేలో జిల్లాలో 54,875 మంది నిరక్షరాస్యులుగా ఉన్నట్టు తేలింది. పలుమార్లు చేట్టిన చిట్టి గురువులు కార్యక్రమంతో అక్షరాస్యులైన వారి సంఖ్య పెరిగింది. ఇటీవల చేపట్టిన ఆధార్ అనుసంధానంలో భాగంగా జిల్లాలో 36,296 మంది మాత్రమే నిరక్షరాస్యులు ఉన్నట్టు జిల్లా వయోజన విద్యాశాఖ తేల్చింది. వీరిని కూడా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది.

వయసు ఆధారంగా మూడు కేటగిరీలుగా నిరక్షరాస్యులు..

జిల్లాలో నిరక్షరాస్యులను వయసు ఆధారంగా మూడు కేటగిరీలుగా (15–35, 35–50, 50 సంవత్సరాలు పైబడిన వారు) జిల్లా అధికారులు విభజించారు. 50 ఏళ్ల వయస్సు పైబడిన నిరక్షరాస్యులు 27 మండలాల్లో 17,550 మంది ఎండగా... ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 14,048 మంది, పట్టణ ప్రాంతాల్లో 3,502 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిని అక్షరాస్యులుగా మార్చే విషయం అటుంచి, మిగిలిన వారికి మళ్లీ చిట్టిగురువులతో శిక్షణ ఇప్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గతేడాది జూలై 20న చిట్టిగురువుల కార్యక్రమాన్ని జిల్లా యంత్రాంగం చేట్టింది. గతేడాది ఆగస్టు మూడో తేదీ నుంచి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నవంబర్ 13, 23వ తేదీల్లో గ్రామీణ, డిసెంబర్ 20న పట్టణాల్లో సామర్థ్యాల మదింపు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల ఫలితాల ద్వారా ఐదు నెలల వ్యవధిలో నమోదైన 92,058 మందిలో 89,142 మంది పరీక్ష రాశారు. ఏ, బీ గ్రేడ్‌ల్లో 86,997 మంది ఉత్తీర్ణులయ్యారు. కేవలం సంతకానికే పరిమితం కాకుండా, చదవడం, రాయడం, అంకెలు గుర్తించగలిగేలా చిన్నారులతో చదువు నేర్పించినట్టు అధికారులు ధ్రువీకరించారు. చిట్టిగురువులుగా జిల్లా వ్యాప్తంగా ఏకంగా 14,126 మంది 8వ తరగతి విద్యార్థులను నియమించారు. జిల్లాలో చిట్టిగురువుల కార్యక్రమం సత్ఫలితాలివ్వడంతో మళ్లీ అదే కార్యక్రమాన్ని నిర్వహించి శతశాతం అక్షరాస్యత సాధనకు ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించినట్టు వయోజన విద్యాశాఖ డీడీ కోట్ల సుగుణాకరరావు తెలిపారు.

చర్మవ్యాధుల పట్ల అప్రమత్తం

- వేసవిలో సోకే అవకాశం
- వైద్యుని సలహా మేరకు మందుల వినియోగం మంచిది



చెమటకాయలు సోకిన రోగి



తామర సోకిన రోగి



చికెన్ పాక్స్ సోకిన రోగి

విజయనగరం ఫోర్ట్: పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు గాలిసోకని దుస్తులు తోడవడంతో ఎక్కువ మంది చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రిక్లీహీట్ (చెమటకాయలు), దురదతో కూడిన పొక్కులు, అమ్మవారు (చికెన్ పాక్స్)తామర వంటి వ్యాధులు బారిన పడి బాధ పడుతున్న రోగులు చర్మ వ్యాధి నిపుణులను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చర్మ వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈ దశలో బయట తిరగడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు సోకుతాయని హెచ్చరిస్తున్నారు. వేసవిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడతాయి. దీంతో చర్మవ్యాధులతో పాటు ఇతర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

సన్‌బర్న్(చర్మం కాలిపోవుట)

ఎండలో ఎక్కువగా తిరిగేవారు సన్‌బర్న్‌కు గురవుతుంటారు. చర్మం అంతా కాలినట్లు మచ్చలు ఏర్పడతాయి. దీనిని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. సన్‌బర్న్‌కు గురైన వారు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. నీరు, పానీయాలు సేవించాలి.

ఉడుకుగడ్డలు

ఇవి చమట గ్రంథుల వల్ల ఏర్పడతాయి. అధిక ఉష్ణోగ్రతలో ఉండే వారికి ఎక్కువగా వస్తుంటాయి. చిన్న చిన్న సెగగడ్డలుగా వస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తాయి. వాటి నివారణకు క్రీమ్స్, పౌడర్ అందుబాటులో ఉన్నాయి. వైద్యుని సలహా మేరకు యాంటిబయోటిక్ మందులు వాడాలి.

ప్రిక్లీహీట్ (చెమటకాయలు)

ఎండలో తిరిగిన వారికి ఎక్కువగా రాష్ వస్తుంది. గాలి సోకని మందమైన దుస్తులు, సిల్క్ దుస్తులు ధరించిన వారు దీని బారిన పడతారు. దీంతో చర్మం అంతా కందిపోయినట్టు అనిపించడం, పొక్కులు రావడం జరుగుతుంది. వీటిని వైద్యుని సలహా మేరకు సన్‌స్క్రీన్ లోషన్స్ వాడడం ద్వారా అరికట్టవచ్చు.

ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్

బిగుతుగా ఉండే వస్త్రాలు ధరించే వారికి, స్నానం చేసిన తర్వాత చర్మాన్ని సరిగా తుడుచుకోకుండా వస్త్రాలు ధరించే వారికి ఎక్కువగా ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ వస్తుంటాయి. తొడల మధ్య తామర రావడంతో పాటు, దురద ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి వారు గోరు వెచ్చని నీటితో స్నానం చేయడంతో పాటు, తేమ లేకుండా చర్మాన్ని తుడిచి సంబంధిత లోషన్స్ రాయడం ద్వారా అరికట్టవచ్చు.

చికెన్ పాక్స్ (అమ్మవారు)

వేసవిలో వైరస్ ఇన్‌ఫెక్షన్‌తో చికెన్ పాక్స్ ఎక్కువగా సోకుతుంది. ఈ వ్యాధిపై మూఢనమ్మకాలు ఉండడంతో ఎక్కువ మంది మందులకు దూరంగా ఉంటారు. దీంతో ముఖంపై గుంటలు పడటం వంటివి జరుగుతాయి. సకాలంలో మందులు వాడితే చర్మంపై ప్రభావం ఉండదు. సన్‌ఎలర్జీతో చర్మంపై దద్దుర్లు, దురదలు వస్తాయి. దీని కారణంగా రాత్రి వేళ నిద్ర సరిగా పట్టదు.

చర్మవ్యాధులకు కారణం

ఎండలో ఎక్కువగా పనిచేయడం, గాలి వెలుతురు లేని గదిలో ఉండడం, గాలి తగలని ప్రదేశంలో ఉండడం, నీరు ఎక్కువగా తాగకపోవడం, ఇరుకుగా ఉండే దుస్తులు ధరించడం, ఎండలోకి వెళ్లినప్పుడు గొడుగు, టోపీ లేకుండా వెళ్లడం, చెమట ఎక్కువగా పట్టినప్పుడు శరీరాన్ని సరిగా శుభ్రం చేసుకోకపోవడం వల్ల చర్మ వ్యాధులు సోకే ఆస్కారం ఉంది.

చర్మ వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు

- వేసవిలో శరీరానికి నూనె వంటి పదార్థాలు సన్‌స్కీన్ లోషన్స్ రాసుకోవాలి
- ఎక్కువగా ఎండ తగలకుండా చూసుకోవాలి. గొడుగు, తలకు టోపీ ధరించాలి
- ముఖ్యంగా వదులైన కాటన్ దుస్తులు ధరించాలి
- రాత్రి వేళ గాలిసోకే ప్రదేశంలో నిద్రించాలి
- గోరు వెచ్చనినీటితో స్నానం చేసి శరీరాన్ని శుభ్రంగా తుడుచుకోవాలి
- స్నానం అనంతరం చర్మానికి పౌడర్ రాసుకుంటే చర్మానికి పొక్కులు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ రాకుండా నివారించవచ్చు

చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి

ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలతో చర్మ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. చల్లని ప్రదేశంలో ఉండడానికి ప్రయత్నించాలి. ఎండలో తిరగకూడదు. అత్యవసరం అనుకుంటే గొడుగు, టోపీ వంటివి ధరించి వెళ్లాలి. చెమట పట్టినప్పుడు శరీరాన్ని శుభ్రపరుచుకోవాలి. చికెన్ పాక్స్ విషయంలో మూఢ నమ్మకాలకు పోకుండా వ్యాధి సోకిన మూడు రోజుల లోపు చూపిస్తే నయం అవుతుంది.

– డాక్టర్ జి. అజయ్‌కుమార్, అసోసియేసిట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి